ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక - 21.1.76

# నాలుగు గదుల ఇల్లు

కథలు ఎన్నో రకాలనీ, అవి రకరకాల మలుపులు తిరుగుతూ అనేకమైన దారుల వెంట పరుగులు తీస్తూ ఉంటాయనీ అందరికీ తెలుసు. కొన్ని కథలు ఉంటాయి. వెన్ను చరిచి కళ్లు తెరుచుకునేటట్టు చేస్తే, మరికొన్ని గిలిగింతలు పెడుతూ హాస్యలోకాలకు తీసుకువెళ్ళి 'జీవితంలో చేదు లేదు' అనే నినాదం ఇస్తూ ఉంటాయి. కానీ, కొందరి జీవితాలు కథల కందని మలుపులు తిరుగుతూ ఉంటాయి. ఆలోచనల్ని తప్పించుకుని ఎటో ప్రయాణం చేస్తూ ఉంటాయి. నిజమయినా "నమ్మశక్యంకాదు" అని నలుగురూ తలలు అడ్డుగా తిప్పేటట్టుగా ఉంటాయి. కథ అయితే రచయిత చేతిలో ఉంటుంది. కానీ, జీవితాలు ఎవరి చేవ్రాతతో నడుస్తాయి? జీవితాన్ని అపసవ్యం చేసేది ఎవరు? ఇది అర్థం కాదు. జవాబు దొరకదు. అందుకే కథలు జీవితాలు అవుతాయి. జీవితాలు కథల కందని ఎత్తుకు పోతూ ఉంటాయి.

నేను ఆ వేళ ఇంటికి కొంచెం పెందరాళే వచ్చినా, లేకపోతే శ్రీమతి అరుణ నేను లేనప్పుడు ఆ మాత్రం చొరవ తీసుకోకపోయినా ఈ కథ ఉండకపోను.

నేను వీధి అరుగు మీద కాలు మోపే సమయానికి అరుణ జడలో సన్నజాజుల దండ తురుముకుని, తెల్లని వాయిల్ చీర కట్టుకుని గుమ్మంలోనే నాకు ఆహ్వానం ఇవ్వాలనేది పెళ్ళయిన మొదట్లో రహస్యంగా మేము చేసుకున్న ఒప్పందాల్లో మొదటిది. అలాగే కొండ విరిగి మీద పడితే తప్ప ఇంటికి నేను ఆలస్యంగా రాకూడదనీ, అలా వస్తే అందుకు నష్ట పరిహారంగా ఆ వారాంతం లోగా సినిమాకి, రిలీజ్ అయిన రోజే తీసుకువెళ్ళాలన్నది మరో ఖరారునామా!

మా సంసారం ఊటీ కొండల మీద పుష్పించడానికి అలవాటు పడ్డ గులాబీ అంటులా నిత్యనూతనంగా సాగుతూంది.

కానీ, ఆ రోజు అందుకు భిన్నంగా గుమ్మంలో అరుణ కనబడకపోయేసరికి రకరకాల వ్యాఖ్యానాలు చేసుకుంటూ, డ్రాయింగ్ రూమ్ నుంచి వంట గదిలోకి, ఆ పైన పడక గదిలోకి వెళ్ళి, హంసతూలికా తల్పం మీద అపర సత్యభామలా ముసుగు తన్ని పడుకున్న అరుణని చూసి నేను గతుక్కుమన్నది నిజం. పక్కనే కూర్చుని "తలనొప్పిగా ఉందా?" అంటూ వీపు నిమిరి జవాబు రాకపోవడంతో కొంచెం ఆమె మీదికి వంగి, వీపు మీద చేయిని ముద్దుగా బుగ్గల మీదికి మళ్ళించబోయాను, కానీ, అరుణ తన ఎడం చేత్తో నా కుడిచేతిని ఓడించిపారేసింది.

"అలిగారేమిటి, అమ్మాయిగారూ? వీధి గుమ్మం దగ్గర నిలబడకుండా మాట తప్పడం మొదటి నేరం. అలా ఆచారం పాటించనప్పుడు జరిమానాగా ఇవ్వవలసిన రెండు..."

"చాల్లెండి. నన్ను విసిగించవద్దు. నా ఒళ్ళు మండిపోతోంది."

"కారణం చెప్పు, నా చిలకవికదూ!"

"నవ్వేలా వస్తోంది, పైగా?" ఒక్కసారి కళ్ళెర్ర జేసి నా వైపు చూసింది అరుణ.

"ఏమయిందట?"

"ఇంకా అడగడం దేనికి? వెళ్ళి ఆ టేబుల్ మీద ఉత్తరం ఉంది చూడండి, చూడ్డం కాదు, చదవండి" అంటూ అరుణ నా గుణాన్నీ, నిజాయితీనీ, నా వంశాన్నీ, నా వాళ్ళనీ, వాళ్ళ వాళ్ళనీ, తన పెళ్ళి చేసిన మేనమామనీ, ఇంకా గుర్తుకురాని వాళ్లనీ కూడా గుర్తుకు తెచ్చుకుంటూ అపరకాళిలా మారి తిట్లతో, సూటిపోటీ మాటలతో, వ్యంగ్యంతో రకరకాల భావ ప్రకటనల్ని జోడించి ముప్పావు గంట పడక గదిలో భయానక, బీభత్స రసాలతో ముంచెత్తి వదిలింది.

మరిచేపోయాను – పాపం అదే సమయంలో అరుణకి కన్నీరు కూడా ఆగిందికాదు. ఆ కన్నీటికి ఏ మహాసముద్రంగా మారే శక్తో ఉన్నట్లయితే ఆ వారధిలో నేనూ, మా ఇరు పక్షాల చుట్టాలూ కూడా సోదిలోకి లేకుండా కొట్టుకుపోయేవాళ్ళమే. ఆ గండం నుంచి నన్ను రక్షించాలన్నట్టు అరుణే అంది!

"వెళ్ళండి. పాపం, ఆ సరళ చుట్టం రాసిన ఉత్తరం మీ గురించి ఆ టేబుల్ మీద పడి ఉంది. అందులో ఆమె హృదయం పదిలపరిచి పంపించింది. అది గాలికి, ధూళికి ఎగరకుండా దాని మీద పేపర్ వెయిట్ పెట్టి వచ్చాను. ఆమె మనసెంత నొచ్చుకుంటుందో! త్వరగా వెళ్ళి దాన్ని ఓదార్చండి. వందల మైళ్ళు నుంచి వచ్చి పాపం, ఎంత అలసి పోయిందో! వెళ్ళి ఆ ఉత్తరాన్ని సేద తీర్చండి. మీ మనసు పాషాణం కాదు, నవనీతం అని నిరూపించుకుందుకు మీకు అట్టే టైము లేదు. కాలహరణం అయితే ప్రాణ హరణమే అవుతుంది. వెళ్ళండి. నన్ను నిద్రపోనివ్వండి."

అరుణకి మతి పోయిందో, నాకు మతి పోయిందో అర్థం కాలేదు. అరుణ చెప్పినట్టు డ్రాయింగ్ రూమ్‌లోకి వెళ్ళాను. పేపర్ వెయిట్ కింద ఉత్తరం అసహాయంగా ఎగరడానికి ప్రయత్నం చేస్తూంది.

"సుబ్బారావుగారికి –

నన్ను మీకు పరిచయం చేసుకోవడం, ఆ తరువాత విపులంగా ఉత్తరం మొదలుపెట్టి ముచ్చటగా ముగించడం – ఇవన్నీ మామూలు పరిస్థితిలో అయితే జరిగేవే! నిజం చెప్పాలంటే మీ మీద నాకు కొండంత కోపంగా ఉంది. మీరు నాకేపాటి ఆప్తులయినా, స్నేహితులయినా నేనే వచ్చి మీ ముక్కుకి తాడు వేసి ఈ అవిడి అనే కుగ్రామం తీసుకువచ్చి సరళ ముందు పడేసేవాణ్ణి. ఆమె ఇప్పటికి మీకు నాలుగైదు ఉత్తరాలు వ్రాశారుట.

సుబ్బారావుగారూ, సరళ పరిస్థితి ఏం బాగా లేదు. క్షణాల మీద ఆరిపోయే దీపం జ్ఞాపకం వస్తూంది నాకు. మీరు వెంటనే వచ్చి సరళని బ్రతికించుకుంటే మంచిది. సరళ – మీకు తన మాటగా వ్రాయమంది – ఇది బహుశా చివరి వార్త అవుతుందని. నాలుగైదు రోజుల్లో మీరు వచ్చి కొన ఊపిరితో వున్న సరళ జీవితాన్ని సవరించి బ్రతుక్కి పరమార్థం ఉందని చెప్పగలిగితే దేవుడి మాట ఏమోగాని ఈ ఊరి వాళ్ళమైన మేము మాత్రం మీకు కృతజ్ఞులం.

–వివేకానందమూర్తి”

వివేకానందమూర్తి ఎవరో, సరళ అతనికేమవుతుందో, యాతావాతా నేను వెడితే సరళకి జరిగే ఉపకారం ఏమిటో నాకు తెలిసి రాలేదు. అడ్రెస్సు చూశాను. పేరయితే నాదే. ఇంటి నంబరు కూడా నాదే! ఈ మహానగరంలో సుబ్బారావు నామధేయులు నేల మీద ఉంటే ఎవరి గుమ్మం అని తట్టి సరళ దీన చరిత్ర చెప్పాలి?

ఆ ఉత్తరమూ, అందులో సంగతులూ వెంటనే మరిచిపోయి నాకేం పట్టనట్టు ఉండవచ్చు. సుబ్బారావు అనే వ్యక్తి బహుశా ఆమె ప్రియుడో, భర్తో అయి ఉండచ్చు. నాకేం సంబంధం లేదు. అయితే, నేనేం చెయ్యాలి. ఉత్తరం నాది కాదని పోస్ట్ ఆఫీసులో వాపసు చెయ్యవచ్చు. కానీ, ఆ అవిడిలో, ఎక్కడో గోదావరి అవతలి కుగ్రామంలో సరళ ఏమవుతుంది? ఆలోచనలో పడ్డాను. వెనుక చప్పుడయింది.

అరుణే అని తెలుసు. అందుకే వెనక్కి తిరగలేదు.

“ఏం చేద్దామా అని ఆలోచిస్తున్నారా?”

“లేదు”

“ఓహో! అయితే, సరళ దగ్గరికి వెళ్ళాలనే నిశ్చయించుకున్నారన్నమాట!”

అరుణ అందగత్తె. నవ్వితే, త్రుళ్ళిపడితే ఆ అందానికి పట్టపగ్గాలు ఉండవు. కోపంలో అరుణ ఎలా ఉంటుందో కూడా నాకు తెలుసు. కానీ, ఈర్ష్య అరుణ అందాన్ని దోచుకోవడం నేను సహించలేను. “అరుణా! నేనో మాట చెపుతాను, వింటావా?”

“ఉహూ”

“అరుణా! సరళ ఎవరో నాకు తెలియదని చెప్పినా నువ్వు నమ్మవు. అందుకే ఆ విషయాలు నేను మాట్లాడ్డం లేదు. కానీ, నేనీ రాత్రికే బయలుదేరి అవిడి వెడుతున్నాను. వివేకానందమూర్తినీ, సరళనీ చూడాలి.”

“మీ ఇష్టం.”

“నేను వచ్చిన తరువాత సరళ ఎవరో సరళకీ నాకూ ఉన్న చుట్టరికం ఏమిటో చెపుతాను. ఈ లోపున చెదిరిపోయిన నీ గుండెని సరిజేసుకుంటే నీకే మనశ్శాంతి. అలా కాదూ – దుఃఖం రెండింతలు చేసుకుంటావంటావా – నీ యిష్టం. అంతే”

❖ ❖ ❖

పరిచయం అయిన స్నేహితుడి ఓదార్పులా గోదావరి గాలి వచ్చి ఒంటికి తగులుతూంది. తెల్లవారబోతూంది. పల్లెటూరు మూలంగా మూడు వంతుల మంది నిద్రలేచి పనిపాటల్లోకి పోతున్నారు. ప్రజ కన్నా ప్రకృతే అక్కడ స్ఫుటంగా కనిపిస్తూంది. వాకబు చేసి వివేకానంద మూర్తి గారి ఇల్లు పట్టుకున్నాను.

నలభై ఏళ్ళు పైబడ్డ వ్యక్తి వచ్చి తలుపు తీశాడు.

"వివేకానందమూర్తిగారు కావాలండీ".

"నేనే" అన్నాడు ఆయన. ఆ తరువాత "మీరూ?" అంటూ నా వైపు కొత్తగా చూశాడు.

"నా పేరు సుబ్బారావు, హైదరాబాద్ నుంచి వచ్చాను."

"అలానా? లోపలికి రా, బాబూ" అంటూ ముందు నడిచాడు.

ఆయన లోపలికి వెళ్ళి, "ఒసే!" అంటూ భార్యని పిలిచి ఏదో చెపుతున్నాడు.

"నేను మళ్ళీ వెళ్ళిపోవాలి. అసలు విషయం చెప్పండి."

"అసలు సంగతంటే?" ఆశ్చర్యంగా చూశారు మూర్తిగారు.

"అదే - సరళ ఎలా ఉంది." ఆత్రతగా అడిగాను.

"ఏం చెప్పమంటారు! ఆమెకి మరీ ఎక్కువ అయితే నిన్న సాయంకాలమే అమలాపురం ఆసుపత్రిలో చేర్పించి వచ్చాను."

"అరెరే! ప్రమాదంగా ఉందా?"

"మీరు ఆలస్యం కాదు, చాలా ఆలస్యం చేశారు. ఆ ప్రాణి మీకోసం ఎంతగా కొట్టుకుందో!"

లోపలి నుంచి మూర్తిగారి భార్య కాబోలు ఇద్దరికీ కాఫీ తీసుకువచ్చి ఇచ్చింది.

"ఆడదై పుట్టకూడదు. ఎంతో నరకం అనుభవించింది. ఆఖరికి ఈ ఇంట్లో ఆమెకి భగవంతుడు రాసి పెట్టాడు. ఎక్కడ పుట్టిందో, ఎక్కడ పెరిగిందో? ఉద్యోగంపేర మా ఇంట్లో ఉండడం ఏమిటి? ఇలా జరగడం ఏమిటి?" ఆవిడ గొణుక్కుంటూ లోపలికి వెళ్ళింది.

మూర్తిగారు నెమ్మదిగా అన్నారు:

"చూడు, నాయనా, మీ ఇద్దరూ ప్రేమించుకుని ఉండవచ్చు. కానీ, నువ్వా అమ్మాయిని ఎందుకు పెళ్ళి చేసుకోలేదో అడిగే హక్కు నాకు లేదు. అయినా, నువ్వు పెళ్ళిచేసుకున్నట్టు సరళకి తెలియకుండా జాగ్రత్తపడ్డా పోయేది."

నేనేం మాట్లాడాలో, ఏం చెప్పాలో తెలియలేదు.

"ఉద్యోగానికి వచ్చినప్పుడు బంగారు బొమ్మలా ఉండేది. కట్టెపుల్లలా అయిపోయింది"

"మూర్తిగారూ, నన్నో మాట చెప్పనిస్తారా?" అన్నాను తల వంచుకుని.

"ఏమిటి?" అన్నారు.

"నా పేరు సుబ్బారావు కావడం నిజమే. కానీ, సరళకీ నాకూ సంబంధం లేదు.

ఆమెని ప్రేమించి పెళ్ళి చేసుకుంటానని చెప్పిన మనిషిని నేను కానండీ."

మూర్తిగారు ఆశ్చర్యంగా నా వైపు చూశారు.

"నిన్ననే మీరు రాసిన ఉత్తరం చూశాను. ఆ ఉత్తరం చదివిన తరువాత 'నా ఉత్తరం కాదు పోనీ' అనుకో బుద్ధి వేయలేదు. తెలియని మనిషి చావు బ్రతుకుల్లో ఉందంటే మనసు ఆగింది కాదు. ఈ విషయం చెబుదామనే ఈ ఊరు వచ్చాను. అలా కాకపోతే మీ నుంచి ఎలాంటి ఉత్తరం మళ్ళీ అందుకోవలసి వస్తుందోనన్న భయం నన్నిక్కడికి లాక్కొచ్చింది. అనుబంధం అంటారు, ఇదేనేమో?"

మూర్తిగారు నా వైపు అలా చూస్తూనే ఉన్నారు. నేనేదో చెపుతూనే ఉన్నాను.

ఆ తరువాత స్నానం చేసి వాళ్ళింట్లోనే భోజనం చేశాను.

భోజనం చేస్తూనే ఆయన మా ఇంటి పేరూ, మా వాళ్ళ ఆచూకీ అడిగారు. అలానే తనూ తన చరిత్ర – సమగ్రంగా కాకపోయినా కొంతలో కొంత చెప్పారు.

"ఇంతదూరం ఎలానూ వచ్చాను. అమలాపురం వెళ్ళి సరళని చూడాలని ఉంది."

ఆయనేం మాట్లాడలేదు. ఆ మధ్యాహ్నం ఎండలో బస్సు కోసం ఇద్దరం బయలుదేరాం. బస్సుస్టాండ్‌లో నించున్నప్పుడు ఆయన నెమ్మదిగా అన్నాడు : "నేను సరళకి బంధువుని కాను. అలాగే నీకూ ఏమీ కాను. నీకన్నా పెద్దవాణ్ణి కాబట్టి చెపుతున్నాను. జీవితంలో వెనక్కి తిరిగి చూసుకున్నప్పుడు మనిషికి మిగిలేది ఆస్తి కాదు, అయినవాళ్ళూకాదు. మనం ఒకళ్ళకి పంచి ఇచ్చిన ప్రేమ, అలాగే మనం ఒకళ్ళ నుంచి అందుకుని స్వంతం చేసుకున్న ఆప్యాయత." ఆగి అన్నారు మళ్ళీ:

"ఇనప్పెట్టె ఉంటుంది. అందులో లక్షలు దాచుకోవచ్చు. అదొక్కటే దాని ఉపయోగం. ఐశ్వర్యం ఉంటుంది. ఒంట నిండా పులుముకోగలం. అంతేగాని, కషాయంగా కాచి తాగలేం. కానీ, మనిషి గుండె ఉంది చూశావా? అది నాలుగు గదుల ఇల్లు. నీకూ, నీ వాళ్ళకు తప్ప మరెవ్వరికీ చోటివ్వనని మంకుపట్టు పడుతుంది. స్వార్థంతో తలుపులు మూసుకుందుకే ప్రయత్నం చేస్తుంది. దాన్ని తెలుసుకోలిగితే చాలు. గుండె ఆగిపోతే మనిషి పోయాడంటారు. అంటే, నాలుగు గదుల ఆ భవనం కూలిపోవడం అన్నమాట. మనసు చంపుకున్న తరువాత స్వార్థంతో, మోసంతో ఆ ఇంటిని నింపుకున్న తరువాత ఆ గుండె కొట్టుకున్నా అది నిజం కాదు. ఆ చప్పుడు పతనానికి ప్రారంభ సంగీతం అవుతుంది."

నేను మూర్తిగారిని చూస్తూ ఉండిపోయాను.

"ఆడదానికి ఈర్ష్యా, అసూయా ఎక్కువని మనం ఏవేవో ఆడిపోస్తూ ఉంటాం. అది అబద్ధం అనిపిస్తూ ఉంటుంది నాకు. నీకు పెళ్ళి అయింది. నీ భార్యతో నువ్వు సంతోషంగా కాపురం చేస్తున్నావు. సరళ జ్ఞాపకాలేమీ నీ కళ్ళలో, నీ మాటల్లో కనబడకుండా హాయిగా బ్రతికేస్తున్నావు. నిజమా, కాదా?"

"మూర్తి గారూ..."

"నీకు పెళ్లి అయిన విషయం నాకెలా తెలిసిందంటావు? సరళకి ఎవరు వ్రాశారంటావు? అవన్నీ ఇప్పుడు అనవసరం. వెళ్ళద్దు, నాయనా, నువ్వు సరళ దగ్గరకు వెళ్ళద్దు. ఆమెని అలాగే చనిపోనీయి. నువ్వు చెప్పే అబద్ధాలన్నీ విని ఆ అమ్మాయి కన్ను మూయడం నాకిష్టం లేదు."

బస్సు వేగంగా బయలుదేరింది. దానితో బాటు దుమ్మూ, ధూళీ లేచాయి. మనసు నిండా అవే నింపుకుని అమలాపురం బయలుదేరాను.

❖ ❖ ❖

నేను జనరల్ హాస్పిటల్‌కు వెళ్ళేసరికి సాయంత్రమయింది. గబగబా లోపలికి వెళ్ళి నన్ను నేను పరిచయం చేసుకున్నాను. సరళ గురించి అడిగాను. డ్యూటీలో ఉన్న డాక్టర్ నా వైపోసారిచూసి, "సరళ అంటే...మొన్ననే కదూ ఆవిడ జాయిన్ అవుత?" అన్నాడు.

"అవును."

"పూర్ లేడీ! ఆవిడకి సెరిబ్రలీ పాల్సీ వచ్చింది."

"అరే!' అన్నాను కంగారురుగా

"ఎవరో ఓ పెద్దాయన తీసుకువచ్చి జాయిన్ చేశాడు." చెప్పడం ఆపి, 'ఇంతకీ ఆమె మీకేమవుతుంది." అంటూ ప్రశ్నించాడు.

ఏమనాలో తెలియక "నా కా అమ్మాయి చిన్నప్పటి నుంచీ తెలుసు. మాది ఒకే ఊరు" అనేశాను.

"ఓ! చాలా సీరియస్ కేసు. మా దగ్గర ఆపరేషన్‌కు లేటెస్ట్ ఎక్విప్‌మెంట్ లేక ఆవిణ్ణి వైజాగ్ పంపించాం.'

నాకేమనాలో తెలియలేదు. సరళ నాకేమీ కాదు. సరళకీ నేనేమీ కాను. కానీ, ఆ అమ్మాయిని చూడాలని వెదుక్కుంటూ వచ్చి కూడాచూడలేకపోయినందుకు నా పేగుల్లో, నా రక్తంలో ఏదో వెలితి తిరుగులాడ్డం మొదలుపెట్టింది.

"బ్రతుకుతుందంటారా?"

"ఎలా చెప్పగలం? అదృష్టం ఉండాలి.'

"వెడతానండీ" అని చెప్పి మెట్లు దిగి వస్తూంటే ఆయనే – "మిస్టర్" అంటూ కేక వేశాడు.

వెనక్కి వెళ్ళాను.

"చూడండి. నిన్న ఆవిణ్ణి డిస్చార్జ్ చేసిన తరువాత ఆవిడ తలగడా క్రింద ఈ ఉత్తరాలు కనిపించాయి. కావలసిన వాళ్ళమంటున్నారు. మీకేమయినా పనికి రావచ్చు" అంటూ ఓ ఉత్తరాల కట్ట డాక్టర్ నా చేతిలో పెట్టాడు. బరువైన మెదడుతో, ఏం చేయాలో తెలియని స్థితిలో అక్కడే కుర్చీలో కూలబడి ఉత్తరాలు చదవడం మొదలుపెట్టాను. ఉత్తరాలు ఐదారు

వరకూ ఉన్నాయి.

అందులో నాలుగు ఉత్తరాలు సుబ్బారావు సరళకి వ్రాసిన ప్రేమలేఖలు. ఒక ఉత్తరంలో – తను ఉద్యోగం సంపాదించుకుని వీలయినంత త్వరలో వచ్చి సరళని తీసుకువెళతానని వ్రాశాడు. మరో ఉత్తరంలో – తనకి ఉద్యోగం దొరికిందనీ, తన వాళ్ళంతా వచ్చి తన దగ్గరే ఉంటున్నారనీ వ్రాశాడు. మూడో ఉత్తరంలో – తను తల్లిదండ్రులతో కులం కాని అమ్మాయిని చేసుకుంటానని చెబితే వాళ్ళెలా ప్రవర్తించిందీ, తనెలా ఎదిరించిందీ వ్రాశాడు. ఆఖరి ఉత్తరంలో – తన వాళ్ళతో ఘర్షణ పడ్డట్టూ, వారం రోజుల్లో తను వస్తున్నట్టూ, ప్రయాణానికి సిద్ధంగా ఉండమనీ, ఏమైనా సరే రిజిష్టర్ మేరేజ్ చేసుకుందామనీ వ్రాశాడు. తారీఖుల ప్రకారం ఆ ఉత్తరం అతను ఏడాది క్రితం వ్రాసింది. ఏ ఉత్తరంలోనూ అతను తన అడ్రెసు చూచాయగా నైనా వ్రాయలేదు. కానీ, అతని ఉత్తరాలన్నీ హైదరాబాద్ నుంచి వ్రాసినవే.

అయితే, మిగిలిన ఒక ఉత్తరం నన్ను ఆశ్చర్యంలో ముంచివేసింది. అది వ్రాసింది సుబ్బారావు భార్య. ఉత్తరం మీద తారీఖు ప్రకారం మూడు నెలల నాడు వ్రాసింది.

"సరళగారికి –

మీరు మా వారికి వ్రాసే ఉత్తరాలన్నీ ఆయనతోబాటు నేనూ చదువుతున్నాను. మీకు ఇదివరలో ఆయన ఉత్తరాలు వ్రాశారట. ఈసారి నన్ను వ్రాయమన్నారు. స్త్రీగా మీరు తొందరపడి ఏం పోగొట్టుకున్నారో నేను ఊహించగలను. కానీ, మీరు మరింత తొందరపాటుతో ఉత్తరాలు వ్రాస్తూ, మరో ఆడదాని హృదయాన్నెంత గాయపరుస్తున్నారో మీకు తెలియదు. ఇంకెప్పుడూ ఉత్తరాలు వ్రాయరని నమ్ముతూ...

– శ్రీమతి సుబ్బారావు".

అలా ఆ ఉత్తరాన్ని చూస్తూ కొన్ని క్షణాలు ఉండిపోయాను. సరళ జీవితంలో ప్రేమించి మోసపోయింది. ప్రేమించటమంత అవివేకమయిన పని వేరే లేదని సుబ్బారావు లోకాన్ని హెచ్చరిస్తున్నాడు. ప్రేమించినా సరే – మరొకరి కోసం ప్రేమని త్యాగం చేయమని స్వార్థంతో ప్రాధేయపడుతూంది శ్రీమతి సుబ్బారావు.

"నేను హైదరాబాద్ వెళ్ళిపోతున్నాను. నాకో ఉపకారం చేస్తారా?" డాక్టర్ దగ్గరికి వెళ్ళి అడిగాను.

"చెప్పండి. తప్పకుండా చేస్తాను" అన్నాడు.

"సరళ బ్రతకడం అనేది జరిగితే నాకు ఆ కబురు తెలియజేయండి. సంతోషిస్తాను. మరో సహాయం. నేనో ఉత్తరం వ్రాసి ఇస్తాను. ఆ అమ్మాయికి అందేటట్టు చూడండి, చాలు."

"సరే" అన్నాడు డాక్టరు ఆశ్చర్యంగా నన్ను చూస్తూ.

నేను ఏ పరిస్థితిలో అవిడి బయలుదేరిందీ, మూర్తిగారు నన్నెలా అపార్థం చేసుకున్నదీ

అన్నీ వ్రాసి ఉత్తరం డాక్టర్ చేతికి ఇచ్చాను.

వేరే నా అడ్రెసు ఆయనకి వ్రాసి ఇచ్చాను. డాక్టర్ కూడా తన చిరునామా చెప్పాడు. ఆయన పేరు మురళీధర్.

నమస్కారం చెప్పి వీధిలోకి అడుగుపెట్టాను.

❖ ❖ ❖

నేను హైదరాబాద్ తిరిగి వచ్చిన తరువాత అరుణ నన్ను సరళ గురించి ఏమీ అడగలేదు. పదే పదే సరళ గుర్తుకు వస్తూ, ఆమె గురించి ఎలా మొదలుపెట్టి ఏ విధంగా అరుణకు చెప్పాలో నాకు అర్థం కాలేదు. కొందరు మనకేమీ కారు. ముఖపరిచయం కూడా ఉండదు. కానీ వాళ్ళ కథలు వింటూనే చలించిపోతాం. ఈ ఆప్యాయతకి అర్థం తోచదు. అరుణ మాత్రం నా కంటికి కొంచెం చిక్కినట్టు కనిపించింది. నేను తనని లెక్క చేయకుండా, ఏమీ చెప్పకుండా సరళ కోసం వెళ్ళినందువల్ల ఏర్పడ్డ దిగులనిపించింది. మా ఇద్దరి మధ్యా ఓ విధమైన స్తబ్ధతే మిగిలింది.

వారం, పది రోజులు గడిచాయి. నేను డాక్టర్ మురళీధర్ వ్రాసే ఉత్తరం కోసం ఎదురుచూస్తూనే ఉన్నాను రోజూ. రెండు రోజుల తరువాత 'మీకు ఉత్తరం వచ్చింది' అంటూ అరుణ నా చేతికో కవరు ఇచ్చింది. ఆత్రతగా విప్పాను.

"సుబ్బారావుగారికి –

నమస్కారములు. వైజాగ్‌లో డాక్టర్లందరూ కలిసి ఆశ చచ్చిన నా శరీరం నిండా మందులు పోసి ఈ కట్టెను బ్రతికించారు. మీరు డాక్టర్ మురళీధర్‌గారికి ఇచ్చిన ఉత్తరం నా కందింది. మీకు ఏం వ్రాయగలను? ఎలా వ్రాయగలను?

తెలివి లేకుండా పడి ఉన్న నాలుగు రోజులే నా జీవితంలో నిజంగా శాంతిని ప్రసాదించాయి. నా గురించి వ్రాయమన్నారు. నాకెవరూ లేరు. నేనూ ఎవరికీ కానిదాన్నే. అనుకోకుండా వచ్చిన చదువు నాకు వ్యక్తిత్వం నేర్పితే – సుబ్బారావు అనే స్నేహితులు నా జీవితంలోకి ప్రవేశించి కొంత ఆశ కల్పించారు. కానీ, నేను దురదృష్టవంతురాలిని. భగవంతుడు కొందరికి అడగకుండానే వరాలిస్తాడు. మరికొందరు ప్రాధేయపడ్డా చిన్న వరం కూడా విదల్చడు.

ఏమీ సంబంధం లేని ఈ సరళ అనే అనాథ కోసం మీరు అంతదూరం నుంచి వచ్చారని తెలిసి నేను తలక్రిందులయాను. మూర్తిగారికి మీ ఉత్తరం చూపించాను. ఆయనా ఆశ్చర్యపోయారు. నా ఉత్తరం నాకు ఏమీ కాని మిమ్మల్ని ముక్కుకి తాడు పోసి ఇంత దూరం రప్పించి, బదులుగా మీకు బోలెడు శ్రమ ఇచ్చింది. అందుకు నేను సిగ్గుపడుతున్నాను. నన్ను క్షమించండి. కష్టాలు ముంచెత్తినా, మనసు ఎదురు తిరిగినా డీలాపడ్డం కూడని పని అని వ్రాశారు. నేను బ్రతుకుతో ఇరవై ఏళ్ళుగా యుద్ధం చేస్తూ ఎదురు దెబ్బలు తింటూనే ఉన్నాను. నడవడం చేతకాక పోయినా, కిందా మీదా పడుతూ

ముందుకే పోవాలేమో? ప్రయత్నిస్తాను. మరోసారి నా కృతజ్ఞతలు అందజేస్తున్నాను.
– సరళ."

అరుణ దూరంగా లోపలి గుమ్మాన్ని ఆనుకుని నించుంది.

అవిడి వెళ్ళే ముందు అరుణతో చెప్పిన మాటలు గుర్తొచ్చాయి. అందుకే, "అరుణా, ఇటు వస్తావా ఓ సారి" అన్నాను.

అరుణ వచ్చింది.

"సరళ ఎవరిని అడిగావు. ఏవేవో ఊహించుకున్నావు కదూ?" అంటూ నేనువెళ్ళడం, అక్కడ జరిగిన సంగతులు అన్నీ చెప్పి, ఉత్తరం చేతికి ఇచ్చాను.

అరుణ ఉత్తరం చదివి పేలవంగా నా వైపు చూసింది.

"క్షమించమని అడుగుతావని నేను ఇవన్నీ చెప్పలేదు. తెలిస్తే మంచిది కదా అని..." నవ్వేశాను.

"అది కాదు..."

"ఏం, అనుమానం తీరలేదా?"

'అయితే, సుబ్బారావుగారికి సరళ విషయాలేవీ తెలియవా?"

"ఎలా తెలుస్తాయి? అతగాడు ఎవరో, ఎక్కడున్నాడో?"

అరుణ తల వంచుకుంది.

"ఏం, అరుణా..."

అరుణ తల ఎత్తింది. కళ్ళ నిండా నీరు చిమ్మింది.

"అదేమిటి, అరుణా!"

"క్షమించండి. సరళ ఇంతకు ముందు రాసిన ఉత్తరాలు మన ఇంటికే వచ్చాయి. అవి ఆ అమ్మాయి మీకే వ్రాస్తూందనుకుని..."

నేను బొమ్మలా వింటున్నాను.

"అవునండీ, మిమ్మల్ని అనుమానించాను. నాకుకాకుండా పోతారనుకన్నాను తప్ప, ఇలా జరుగుతుందని..." అరుణ ఏవేవో చెపుతూనే ఉంది.

నాకు ఆ క్షణంలో అరుణని దూషించాలని గానీ, ఎత్తిపొడవాలనిగానీ, అసహ్యించుకోవాలని గానీ అనిపించలేదు.

మనిషి గుండెలో గూడు కట్టుకుని ఉండే ప్రేమ ఎంత సంకుచితమయిందో తెలిసి భయపడ్డాను. ఈర్ష్యాసూయలతో నిండిన గుండె చీకటి కొట్టులా మారిపోవడం తెలిసి క్రుంగిపోయాను. మూర్తిగారు చెప్పిన మాటలు గుర్తొచ్చి, అవే చెప్పి అరుణని మనిషిగా చేయడం తప్పించి నాకు వేరే దారి తోచలేదు. ❖